నిర్మాణంవల్లనూ, కొన్ని విదేశ పదాలనూ, ముఖ్యంగా ఫ్రెంచి భాషనుండి దైనందిన వ్యావహారిక, సాంఘిక పదాలనూ, ఇంగ్లీషు, జర్మన్, డచ్, తదితర భాషలనుండి కొన్ని పదాలనూ తన పదజాలంలో చేర్చుకోవడంవల్లనూ బాగా అభివృద్ధి చెందింది. ఇతర భాషలనుండి తెచ్చుకున్న పదాలు పారిభాషిక పదాలు మూలభాషా సంపదను సూచిస్తాయి. ఇతర భాషలనుండి పదాలను తనలో కలుపుకునే సామర్థ్యాన్ని తెలియజేస్తాయి.

అక్టోబరు సామ్యవాద మహా విప్లవంవల్ల రష్యన్ భాష బాగా పెంపొందింది. నూతన సాంఘిక పరిస్థితులు ఏర్పడడంవల్లనూ, నూతన దేశీయత పెంపొందడంవల్లనూ పూర్వపు సాంఘిక వ్యవస్థకు చెందిన భావాలను తెలిపే కొన్నిపదాలు పూర్తిగా మాయమయాయి; తక్కినవి భద్రంగా వున్నాయి కాని వాటికి కొత్త అర్థాలు ఏర్పడ్డాయి. అంతేకాక, నూతనభావాల ప్రభావంవల్ల నూతన పదాలు పరిభాష సృష్టింపబడ్డాయి. మొత్తంమీద ప్రబలమైన సంస్కృతి వికాసం, ప్రపంచదృక్పథంలోనూ భౌతిక సంస్కృతిలోనూ, పూర్తి మార్పులు, ముఖ్యంగా, అనేక సాంకేతిక శాఖల అభివృద్ధి—యివన్నీ రష్యన్ భాష శబ్దసంపద బ్రహ్మాండంగా వృద్ధి కావడానికి దారితీశాయి. అంతేకాక, సోవియట్ దేశంలోని వివిధ జాతుల మధ్యగల అత్యంత సన్నిహిత రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు రష్యన్ భాషనుండి పదాలను తీసుకోవడంతో యీ జాతుల భాషలు పెంపొందడానికే సోవియట్ రిపబ్లిక్కుల జాతీయభాషల నుండి పదాలను కలుపుకుని రష్యన్ భాష పెంపొందడానికి దోహదమయ్యాయి.

---

గల్పిక

# పొట్లపాదు

"మంజుశ్రీ"

రత్తిగాడు గుడిశెదగ్గర పొట్లపాదుకాడ కూకుని ముఖం కడుక్కుంటున్నాడు. ఇంతలోకే మా లక్షిమి పిలిచింది. "ఒరే రత్తిగా వాళ్ళ పుచ్చపాదు చూడరా కొమ్మల రెమ్మలమీద యెట్లా వస్తుందదో. గుమ్మటమోలె పెరుగుతున్నది. గుడెశెంతా అల్లుకుంటుంది. ఆకాకుకు కాయ కాస్తది. మన పొట్లసెట్టు ఎక్కరావటం లేదురా" అంది. "మన పొట్లసెట్టు గూడా బాగానే వస్తుందది లేవే" అన్నాడు రత్తిగాడు. "ఏం రావటంలే వాళ్ళ పుచ్చపాదులా రావటంలేదు" అంది మా లక్షిమి. రత్తిగాడు పరకాయించి చూశాడు. పై కొమ్మలు బాగానే పాకుతున్నాయి కాని దుంప బాగా పూరటంలేదు. ఏదో రోగం పడ్డట్లుంది. కిందటేడు కూడా యింతే. పందిరంతా అల్లుకుంది. పట్టుమని పదికాయలు కూడ కాయలేదు. పదిరూపాయలు కూడా రాలేదు. సుబ్బులుగాడి పుచ్చపాదు ఏం, ఏపుగా వస్తుందది? క్రింద టేడు కూడా అంతే గుమ్మటమే. గుడిశెంతా అల్లుకొని పందకాయా కాసింది. కాయలు ముందేసుకుని మార్కెట్టుకాడ కూకున్నాడ్డు సుబ్బులు. పాతిక రూపాయ లొచ్చినై. కిందటేడు కోటయ్య కొండకాడ తిరునాళ్లకు రూపాయి పట్టుకు పోయాడు సుబ్బులు. టోపీ, జిలేబీ, చెరుగ్గడ ఇవన్నీ కొనుక్కున్నాడు రంకులరాట్నం యెక్కిండట. ఓలమ్మ యెక్కి గిర్రున తిరుగుతుంటే, కళ్లు తిరుగుతాయట. అవన్నీ చెపుతుంటే తానూ పోయినట్టే వుంది రత్తిగాడికి. ఓ పావలా డబ్బులు కూడా యియ్యకపాయె అమ్మ. ఓలమ్మ...ఏం పెబలు, ఏం జనం, ఎంతమంది మడుసులు, ఎంత చందడి, వీడి తస్సాదియ్య ఎట్టపోయిండో మా లావుగటుకుడు, గాసరబీసర గుంటదట. తొక్కిడికి సత్తారని ఎఱ్ఱబుట్టలోళ్లు వొత్తారట. పందేలట, ప్రతిపెబకాడ లేడియో, సీపకరు, తస్సాదియ్య, ఓ బాలరాజా...ఈ యెడన్నా పోవాల్సిందే. ఈ పొట్లచెట్టు పదికాయలొస్తే అమ్మకు చెప్పకుండా వో రూపాయి దాచిపెట్టుకోవాలి. ఆ

రూపాయి తీసుకుని సుబ్బిగాడితోటు కోటయ్యకొండకు చల్ మోహనరంగా అనుకుంటూపోవాలి. రంకులరాట్నం యెక్కాల్సిందే. కళ్ళు తిరిగినా మానె. పడిచచ్చినా సరే రంకులరాట మెక్కి తిరగాల్సిందే, గుఱ్ఱంమీద కూకుని గట్టుగా పట్టుకుని కళ్లు మూసుకుంటే మూసుకుంటేసరి కళ్లు తిరగవు, పాడు తిరగవు. జిలేబీ కొనుక్కోవాలి, చెరుగ్గడలు కొనుక్కోవాలి. సుబ్బిగాడు ఇప్పుడు నిదరలేచి వచ్చినట్లుంది. పాదుకాడ కూచుని చెత్తదీస్తున్నాడు. వాడికేం వాళ్లమ్మ డబ్బులిత్తుంది.

మొన్నీమధ్య వాడు కొత్తచొక్కా, కొత్త షరాయి కుట్టిచ్చుకొని ఎప్పుడూ తన ముందుకే నిలుచుండేవాడు. తనకేగాంద కొత్తచొక్కా వుందని. తనకుకూడా కొత్తచొక్కా కుట్టిచ్చమని అడిగితే అట్లగు లెగుస్తది. రోజూ పిలిచినారని సుబ్బిగాడు, "ఆడుకుందాం, రారా, రత్తిగా," అని మూడుసార్లు పిలిచాడు. ఆడుకుంటుండగా తన బురదచెయ్యివాడి చొక్కాకు తగిలింది. సుబ్బిగాడు తననికొట్టి వాళ్ళమ్మ తోటుపోయి చెప్పాడు, "కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారటరా" అని సుబ్బిగాడి అమ్మవచ్చి గుడిసెముందు నిలబడి తిట్టుపోసింది.

ఈ యేటు సామిదయవల్ల పొట్లపాదు బాగా కాస్తే ఎండల కాలంలో సుబ్బిగాడు సంపాయించే డబ్బులకంటే ఎక్కువే వస్తయి. కొత్త చొక్కా, కొత్తషరాయి కుట్టించుకోవచ్చు— పోయి సుబ్బిగాడిముందు నిలబడి చూపించవచ్చు. వాడంటే తనకు మంట.

మర్రోజు ప్రొద్దున్నే రత్తిగాడు పాకకాడ కూకొని ముఖం కడుక్కుంటున్నాడు.

"ఒరే రత్తిగా వాళ్ళ పుచ్చపాదును పందికొక్కు కొట్టేసింది. సూడు యెట్లా ఎండిపోయిందో నిన్నెంత బాగుండదిరా" అంది అమ్మ. రత్తిగాడు వులిక్కిపడ్డాడు. ఇంకేమీ మాట్లాడలేదు.

మర్రోజు రత్తిగాడు పొట్లపాదుకాడ కొచ్చేటప్పటికి, పాదు మాడిపోయివుంది. దుంప తెగిపోయివుంది. అక్కడనే కూలబడి రత్తిగాడు భోరున యేడ్చాడు.

"పందికొక్కు మరిగిందిరా నిన్న వాళ్ళది కొట్టేసింది. ఇయ్యాల మనది కొట్టేసింది" అంది అమ్మ. రత్తిగాడు యేడుస్తునే వున్నాడు.

నిన్నరాత్రి వెన్నెట్లోని పుచ్చపాదు దుంప యొక్క సౌకుమార్యం వాడికళ్ళలో మెరుపు మెరిసినట్టు కొట్టింది వాళ్ళమ్మ పందికొక్కును బూతులు తిడుతున్నది.

---

స్కెచ్

# నష్టజాతకుడు

ఆమంచి మధుసూధనరావు

కనిపించే మనుషులు కంఠంమీద కాలేసి తొక్కిపెడుతుంటే, కనిపించని గ్రహాలు బలంగా లేవంటూ వేదాంతం చెపుతాడు మా మహేశం.

1949నాటి సంగతి. ఇంటరు ఫస్టుక్లాసులో పాసయిన మా మహేశం ఇంజనీరింగు కాలేజి కొకటి, మెడికల్ కాలేజీ కొకటి అప్లికేషన్లు పడేసాడు. 'నువ్వో ఒక మనిషివి, నీదీ ఒక దరఖాస్తు' అన్నట్టు, ఆయినకాడికి పదిరూపాయలు ఫీజుగా మింగి మొండిచెయ్యి చూపించారు ఇంజనీరింగు కాలేజీవారు. జవాబయినా ఇవ్వలేదు మెడికల్ కాలేజివారు. "మన జాతకంలో డాక్టరూ, ఇంజనీరూ అయ్యేయోగంలేదురా" అన్నాడు మా మహేశం. ఏమి చెయ్యడానికి తోచక తికమక పడిపోతున్న మహేశానికి, యెవరికి తోచిన సలహా వారు సెలవిచ్చారు. ఒక బుద్ధిమంతుడు చాల సింపుల్‌గా తేల్చిచెప్పాడు. "ఇంటరుతర్వాత చెయ్యవలసిందేమిటని గింజుకోవలసినంత అవసరమేముందోయి! మనకి మెయిన్‌రోడ్డు వుండనే వుందిగా. బి. ఏ., బి. ఎస్. సి; బి. కాం; యేదో ఒకటి చదివేయి."